డ్రైయిన్‌లు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్: వరదనీరు నిలువకుండా డ్రైయిన్‌లు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని కుత్బుల్లాపూర్ సర్కిల్ డీఈఈ పాపమ్మ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి ఫస్ట్ ఎవెన్యూ కాలనీ, మహానగర్ బ్రిడ్జీల వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంగళవారం స్థానికంగా పర్యటించిన పాపమ్మ సమస్యను పరిశీలించారు. వరదనీరు సజావుగా వెళ్లేగా భూగర్భ డ్రైయిన్‌లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

పాతరేట్లు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నిజాంపేట్: నిత్యావసర వస్తువులపైన పాత రేట్లు వసూలు చేస్తున్న దుకాణదారులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ 2.0నూతన స్లాబ్ రేట్లు విధానం ద్వారా సరళతరం కావడంతో మంగళవారం నుంచి దాదాపు 400 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడం జరిగిందన్నారు. మధ్యలో ఉన్న దళారులు, డీలర్లు ఈ తగ్గింపును కస్టమర్లకు బదిలీ చేయకుండా పాత రేట్లకే అమ్ముతున్నారని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయంలో చండీ హోమం

నిజాంపేట్: విజయదశమి మహోత్సవంలో భాగంగా రెండవ రోజు నిజాంపేట్‌లోని కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కుమారి దేవి అమ్మవారిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. మంగళవారం ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ నరసింహారెడ్డి వారి ధర్మపత్ని పద్మమ్మలు కలిసి ఆలయంలో కుమారి దేవి చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, బొర్రా అశోక్, నిజాంపేట్ గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గాయత్రిదేవిగా అమ్మవారు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీగాయత్రీదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– రంగారెడ్డినగర్



గాయత్రిదేవి అలంకరణలో గాజులరామారం చిత్తారమ్మదేవి



నిజాంపేట్ దుర్గమ్మ ఆలయంలో..



చిత్తారమ్మ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



దూలపల్లిలోని దుర్గామాత మండపం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదర్శ డివిజన్‌గా తీర్చి దిద్దుతా

రంగారెడ్డినగర్: సమస్యలు లేని డివిజన్‌గా రంగారెడ్డినగర్‌ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ, హైడ్రా, జలమండలి అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గిరినగర్‌లో శిథిలమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్‌ను పరిశీలించిన కార్పొరేటర్ వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి నూతన పైపులైన్ వేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. గాంధీ నగర్ నుంచి ఆజ్‌బెస్టాస్ కమాన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండగా, పెండింగులో ఉన్న పైపులైన్ పనులను చేపట్టాలని కోరారు. వెంకట్‌రామ్‌రెడ్డినగర్‌లో నాలా నుండి మురుగునీరు బయటికి ప్రవహిస్తోందని స్థానికులు వివరించారు.



డ్రైనేజీ సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

అదనంగా కరెంట్ బిల్లు !

సుభాష్‌నగర్: ఓ వినియోదారుడికి ప్రతి నెల వచ్చే దానికంటే పది రెట్ల కరెంట్ బిల్లును సంబంధిత అధికారులు వాయించారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని శ్రీనివాస చారి, నాగరాణి దంపతుల నివాసానికి ప్రతి నెల రూ.1000 నుంచి 1200 లోపు కరెంట్ బిల్లు వస్తుంది. కానీ సెప్టెంబర్ నెలలో మాత్రం ఏకంగా 12,515 రూపాయలు రావడంతో ఖంగుతిన్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారులు పట్టించుకొని కరెంట్ బిల్లు యధావిధిగా వచ్చే విధంగా సవరించాలని శ్రీనివాస్ చారి కోరారు. గతంలో సూరారం పరిధిలో పలుచోట్ల ఏకంగా లక్షల బిల్లులు వేసిన ఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో బుధవారం రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. దేవమ్మ బస్తీలో రూ.20 లక్షల వ్యయంతో, సంజయ్ పూరీ కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వివేకానంద, కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేయనున్నారు.

పేద ప్రజలకు న్యాయం చేస్తాం



కుత్బుల్లాపూర్: ఇళ్లు కోల్పోయిన పేద ప్రజల కష్టాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మిథిలానగర్‌లో రెండు రోజుల క్రితం హైడ్రా అధికారులు ప్రభుత్వ భూమిలో కూల్చివేతలు చేపట్టగా నిరాశ్రయులైన మిథులనగర్ ప్రజలు మంగళవారం శ్రీశైలంగౌడ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు బస్తీలు, కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప నూతన సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప సముదాయంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామన్నారు. స్థానికంగా ఏ సమస్యలు నెలకొన్నా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మారావు అంజయ్య, కార్యదర్శి భూపతి రెడ్డి, స్థానికులు పరశురాం, కరికే నవీన్, వైకుంఠం, పాండు, వెంకట్, చంద్రమౌళి, తిరుపతి తదితరులు ఉన్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ జగన్

హైడ్రా వచ్చింది ఉయ్యాలో.. మా ఇళ్లను కూల్చింది ఉయ్యాలో..

కూల్చివేతలపై వినూత్న నిరసన

సుభాష్‌నగర్: 'హైడ్రా వచ్చింది ఉయ్యాలో... మమ్మల్ని ఆగం చేసింది ఉయ్యాలో, మా మా ఇళ్లను కూల్చింది ఉయ్యాలో... మా బతుకుల్లో చీకట్లో నింపింది ఉయ్యాలో, ఉన్న ఇల్లు కూల్చి ఉయ్యాలో మా ఉసురు తీశారు ఉయ్యాలో' అంటూ హైడ్రా అధికారుల వైఖరిని నిరసిస్తూ గాజుల రామారంలోని బాలయ్య నగర్ లో ఇల్లు కూలిపోయిన బాధితులు మంగళవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు కాగడాలు శిథిలాల వద్ద ఉంచి బతుకమ్మ పాటల రూపంలో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దిగివచ్చి మమ్మల్ని ఆదుకునేంతవరకు తమ నిరసన కొనసాగిస్తామని తెలిపారు.



కొవ్వొత్తులు వెలిగించి బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న బాధితులు

రోడ్లపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు



గుంతలు పూడ్చుతున్న దృశ్యం

నిజాంపేట్: హైదరాబాద్ నగరంలో వర్షాలు కురిసినప్పుడల్లా రహదారులపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా బాచుపల్లి ఫ్లైఓవర్ సమీపంలో కూడా ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మియాపూర్ నుంచి గండి మైసమ్మ చౌరస్తా వైపు రహదారిలో భారీ గుంతలు ఏర్పడి, వాటిలో నీరు నిల్వ ఉండటంతో ప్రయాణం కష్టసాధ్యమైంది. గుంతలు, బురద, నీటి మడుగులతో రహదారులు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువైంది. ఈ పరిస్థితిని గమనించిన మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టారు. మంగళవారం గుంతల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి, వాటిని కాంక్రీటుతో పూడ్చారు. దీంతో వాహనదారులకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. రోడ్డు పరిస్థితులు చాలా దారుణంగా మారాయి. చిన్న వర్షం పడినా వాహనాలు జారిపడే పరిస్థితి. పోలీసులు ముందుకొచ్చి గుంతలను పూడ్చడం ఎంతో ఉపయోగకరంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు. ఇది అసలు రోడ్డు మరమ్మతులు చేసే పనిగా మున్సిపల్ శాఖ వ్యవహరించాలి. కానీ ట్రాఫిక్ పోలీసులు ముందుకొచ్చి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించాల్సిన పరిస్థితి రావడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.